వైద్యురాలి ఇంట్లో చోరీ.. పనిమనిషి అరెస్ట్

ఆభరణాలు స్వాధీనం



ఆభరణాలు

బంజారాహిల్స్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): వైద్యురాలి ఇంట్లో చోరీకి పాల్పడిన పనిమనిషిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని అరోరా కాలనీలో నివసించే వైద్యురాలు తుహీనాశర్మ ఇంట్లో రెండు నెలల క్రితం బంజారాహిల్స్ రోడ్డునంబర్.5లోని దేవరకొండ బస్తీలో నివసించే లక్ష్మి పనిమనిషిగా చేరింది. వైద్యురాలు ఇంట్లో అల్మారాలో పెట్టిన బంగారు గొలుసు, వజ్రాల నెక్లెస్, చెవిదిద్దులు, రూ. 85 వేల నగదు మాయమైనట్లు 27న గుర్తించారు. దీంతో ఆమె పనిమనిషిపై అనుమానం వ్యక్తం చేస్తూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన బంజారాహిల్స్ క్రైం పోలీసులు లక్ష్మిని నిజామాబాద్ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా ఆభరణాలు, నగదు చోరీ చేసినట్లు అంగీకరించింది. దీంతో ఆమెను అరెస్ట్ చేసి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 'నూతన' వేడుకలు



వేడుకల్లో ఎఫ్ఎన్‌ఎస్‌సీ నిర్వాహకులు

బంజారాహిల్స్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలో భాగంగా ఇనఫ్యూజన్ బ్యాండ్ ఏర్పాటు చేసిన సంగీత విభావరి, బెలీ డ్యాన్స్, 30 మంది ముంబై యువకులు చేసిన ఎరోబిక్స్ డ్యాన్స్, జోడీ డ్యాన్స్‌లు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ నాయకులు పాల్గొని 2023కు వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. సెక్రటరీ మోహన్ ముళ్లపూడి మాట్లాడుతూ 'గతంలో ఉన్న కమిటీ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌ను ఎంతో అభివృద్ధి చేసింది. మేము కూడా అదే దిశగా ముందుకు తీసుకెళతాం. దక్షిణాదిలో నంబర్ వన్ కల్చరల్ సెంటర్‌గా తీర్చిదిద్దుతాం' అని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీసీ ప్రెసిడెంట్ జి. ఆదిశేషగిరి రావు, వైస్ ప్రెసిడెంట్ తుమ్మల రంగారావు, సెక్రటరీ ముళ్లపూడి మోహన్, జాయింట్ సెక్రటరీ పెద్దిరాజు, రాజశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కాజా సూర్యనారాయణ, మురళీమోహన్, శైలజ, బాలరాజు, గోపాలరావు, రాజామోహన్ వడ్లపట్ల, ఇంద్రపాల్‌రెడ్డి, వరప్రసాదరావు పాల్గొన్నారు.



నారాయణమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేక్

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

● ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

బంజారాహిల్స్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఫిలింనగర్‌కు చెందిన పారిశుధ్య కార్మికురాలు నారాయణమ్మ జాతీయ కర్మచారి అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం ఆమెను మాల వెలుగు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, తులసి రాజలింగం, దండు మన్యం, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ మేలు జరగాలి : అనూషరామ్



బంజారాహిల్స్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో అందరికీ మేలు జరగాలని ఆకాంక్షిస్తున్నట్టు బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు అనూషరామ్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కరోనా అంతరించాక 2023లో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారన్నారు. 2024లో కూడా ఇదేవిధంగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గ్రేటర్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని తెలిపారు. ఖైరతాబాద్‌లో దానం నాగేందర్‌ను గెలిపించేందుకు పార్టీ శ్రేణులు తీవ్రంగా శ్రమించాయని చెప్పారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం పేదలకు మేలు చేసేలా పనిచేయాలని సూచించారు.

ప్రైవేట్ వర్సిటీల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీని ప్రకటించడం హర్షణీయమని రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని ఆయన సీఎంకు సూచించారు. ప్రైవేట్ యూనివర్సిటీలలో బీసీలకూ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీభవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. మెగా డీఎస్సీపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే ఉన్నత స్థాయి సమావేశాలలో విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాలను ఆహ్వానించి వారి సూచనలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. మెగా డీఎస్సీ ప్రకటించే ముందు విద్యాశాఖలో ఉపాధ్యాయ ఖాళీలపై శ్వేతప్రతం విడుదల చేసి క్లారిటీ ఇవ్వాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ 13 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని అసెంబ్లీలో ప్రకటించి అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, అంజియాదవ్, అనంతయ్య, రాజేందర్, సురేష్, ఉదయ్, జయంతి, లింగయ్యయాదవ్, నిఖిల్, ప్రియా తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్య కార్యక్రమాల సారథి ఆకృతి సుధాకర్

నల్లకుంట, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత ప్రమాణాలతో వైవిధ్యభరితమైన కార్యక్రమాలు నిర్వహించే సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకృతి సుధాకర్ అని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ప్రశంసించారు. వైవిధ్య కార్యక్రమాల సారథి సంస్థ ఆకృతినే తన పేరుగా మార్చుకున్న వ్యక్తి సుధాకర్ అని కొనియాడారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో సుపథం సంస్థ ఆధ్వర్యంలో ఆకృతి సుధాకర్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాతగుప్తా, ఫిక్కీ సీఎండీ అచ్యుత జగదీష్ చంద్ర, జూబ్లీహిల్స్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మోహన్‌కృష్ణ ఆకృతి సుధాకర్‌కు శాలువా కప్పి మెమోంటో బహూకరించి ఘనంగా సత్కరించారు.

లక్ష్మీనర్సింహనగర్ మాజీ గౌరవ అధ్యక్షుడు కన్నుమూత



ఈశ్వరరావు(ఫైల్)

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనర్సింహనగర్ మాజీ గౌరవ అధ్యక్షుడు దాసరి ఈశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. కొంతకాలంగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. సోమవారం ఉదయం పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈశ్వరరావు లక్ష్మీనర్సింహనగర్ వ్యవస్థాపకుల్లో ఒకరు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మరణం స్థానికంగా అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది.

వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఖైరతాబాద్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్, లింగ బలిజ కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి యువతకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ గణపతి కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి జి.దినేష్ పాటిల్, కోశాధికారి కళ్లపల్లి రాచప్ప, కేంద్ర కమిటీ సభ్యుడు శెట్టి శివకుమార్ మాట్లాడారు. సంఘం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. తమ కుల సంఘానికి ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రంలో భవనాలు కట్టించాలని, సంఘం తరఫున రుద్రభూమి కోసం ఒక ఎకరం స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు కె.శివప్ప, శివచరణ్, భరత్, సోమేష్ రఘు, అనిల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజలో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

వైభవంగా అయ్యప్ప పడిపూజ

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ జంగయ్యబస్తీలోని హనుమాన్ ఆలయం ప్రాంగణంలో 14వ వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ ఆదివారం వైభవంగా జరిగింది. మహాకుంభాభిషేక హోమం, చండీయాగం, అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. అంతయ్య గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రెహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, నాయకులు షరీఫ్, శ్రీను హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు పాండు, మోహన్, అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.



అయోధ్య శ్రీ భవ్య రామ మందిర నిర్మాణం సందర్భంగా అయోధ్య రామ మందిరం నుంచి సనత్‌నగర్‌కు వచ్చిన శ్రీ సీతారాముల వారి అక్షింతలను ఊరేగింపుగా తీసుకొస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు లింగంపల్లి నర్సింగరావు, తదితరులు

- సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి



రెహ్మత్‌నగర్ శ్రీరామ భక్త బృందం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ అక్షింతలను రెహ్మత్‌నగర్ వీధుల్లో ఊరేగించారు. సోమవారం నుంచి 15వ తేదీ వరకు అక్షింతలు ఇంటింటికీ పంచుతామని వారు తెలిపారు. - యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

లష్కర్‌లో న్యూఇయర్ జోష్

ప్రస్తుత ఏడాది తాలూకు చేదు జ్ఞాపకాలను మరిచిపోతూ, కొత్త సంవత్సరంలో అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ లష్కర్ వాసులు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. కుల, మత, భాష, వయో బేధం లేకుండా ఆబాలగోపాలం నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లలోని కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లలో ఆదివారం సాయంత్రం నుంచే కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి.


సికింద్రాబాద్ సెయింట్ మేరీ చర్చిలో ప్రార్థనలు


బేకరీల్లో కేక్ కొనుగోలు చేస్తూ..

సికింద్రాబాద్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): రాత్రి గడిచిన కొద్దీ నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. లష్కర్‌లోని హోటళ్లు, రెస్టారెంట్లు మధ్యాహ్నం నుంచే కిటకిటలాడాయి. ప్రధాన రహదారుల్లోని వర్తక, వాణిజ్య కేంద్రాలను అందంగా ముస్తాబు చేసి, జిగేలుమనిపించారు. ముఖ్యంగా షాపింగ్ సెంటర్లకు కేరాఫ్‌గా నిలిచే ప్యాట్నీ సెంటర్ పరిసరాలు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కళకళలాడాయి. పలువురు తమ ఇళ్లలో కుటుంబ సభ్యులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతల నివాసాలు, కార్యాలయాలు ఆదివారం సందడిగా మారాయి. తమ నేతలకు ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ముందుగానే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బేకరీలు, మిఠాయి దుకాణాలు, ఐస్‌క్రీమ్ పార్లర్లు సైతం రద్దీగా కనిపించాయి. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎటువంటి అపశ్రుతులు దొర్లకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించారు.


ఆకృతి సుధాకర్‌ను సత్కరిస్తున్న డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

వైవిధ్య కార్యక్రమాల సారథి ఆకృతి సుధాకర్

తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

నల్లకుంట, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత ప్రమాణాలతో వైవిధ్యభరితమైన కార్యక్రమాలు నిర్వహించే సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకృతి సుధాకర్ అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ప్రశంసించారు. వైవిధ్య కార్యక్రమాల సారథి సంస్థ ఆకృతినే తన పేరుగా మార్చుకున్న వ్యక్తి సుధాకర్ అని కొనియాడారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో సుపథం సంస్థ ఆధ్వర్యంలో ఆకృతి సుధాకర్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విభిన్న రంగాల దిగ్గజ ప్రముఖులను సత్కరించిన ఆకృతి సుధాకర్‌ను నేడు సత్కరించడం వైవిధ్యంగా ఉందన్నారు. ఆకృతి సంస్థ కార్యక్రమాలు మూస పద్ధతిలో కాకుండా కొత్తదనం, హుందాతనం ఉంటాయన్నారు. సన్మాన, అవార్డు గ్రహీతల ఎంపిక నిబద్ధత, విలువల ఆధారంగా చేస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాతగుప్తా, ఫిక్కీ సీఎండీ అచ్యుత జగదీష్ చంద్ర, జూబ్లీహిల్స్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మోహన్‌కృష్ణ ఆకృతి సుధాకర్‌కు శాలువాకప్పి మెమోంటో బహూకరించి ఘనంగా సత్కరించారు.


డ్రంక్ అండ్ డ్రైవ్‌పై యువతకు అవగాహన కల్పిస్తున్న తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు

డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన

తిరుమలగిరి, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదు అంటూ తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు పిలుపునిచ్చారు. ఆదివారం తిరుమలగిరిలో ప్లకార్డ్స్ చేతబూని యువతకు అవగాహన కల్పించారు. ఎస్సై శ్రీ రాంచందర్, ఏఎస్సై జై కిషన్, ట్రాఫిక్ పీఎస్ స్టాఫ్, ప్రజలు పాల్గొన్నారు.



హోలీ ఫ్యామిలీ చర్చ్‌లో గిఫ్ట్స్ పంపిణీ చేస్తున్న రాయడన్ రోచ్

మైనారిటీల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి

తిరుమలగిరి, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని మైనారిటీ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ రాయడన్ రోచ్ అన్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు సందర్భంగా తిరుమలగిరిలోని హోలీ ఫ్యామిలీ చర్చ్‌లో ఆదివారం రాష్ట్ర మైనారిటీ సెల్ కన్వీనర్ రేమండ్ హార్వర్డ్‌తో కలిసి మైనారిటీ వర్గాలకు క్రిస్మస్ గిఫ్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే క్రిస్మస్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ వచ్చాయని, అయినా కూడా ప్రభుత్వం వెనకకు పోకుండా 33 కోట్లు రిలీజ్ చేసి గిఫ్ట్ ప్యాకెట్స్‌ను అందజేసిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మైనారిటీలకు ఎలాంటి అన్యాయం జరగదని, వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తిరుమలగిరి హోలీ ఫ్యామిలీ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అవార్డు గ్రహీత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైఖెల్ అబ్రహం, మౌంట్ కార్మెల్ చాపెల్ ప్రెసిడెంట్ జూడ్ రఫెల్ పాల్గొన్నారు.


అనాథలకు దుప్పట్లు అందజేస్తున్న స్కైఫౌండేషన్ సభ్యులు

స్కైఫౌండేషన్ దుప్పట్ల పంపిణీ

పద్మారావునగర్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : పద్మారావునగర్‌లోని స్కైఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని ఆధ్వర్యంలో శనివారం రాత్రి రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై చలికి వణుకుతూ...నిద్రిస్తూ, దుర్భరజీవనం గడుపుతున్న అనాథలు, అభాగ్యులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నారులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కీర్తి, ఖుషి, కోమల్, నిశాంత్, అఖిల్, హరీశ్, శుభం, వెంకటేశ్, సాయికిరణ్‌లు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


వి.బలేశ్వరయ్య

బోయిన్‌పల్లి, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని స్వర్గదామం నగర్‌లో నివాసం ఉంటున్న వి.బలేశ్వరయ్య(77) విశ్రాంతి ఉద్యోగి. తన కుమారుడు సురేష్‌తో కలిసి ఉంటున్నాడు. శనివారం ఉదయం కుమారుడు సురేష్ భార్య, పిల్లలతో కలిసి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో తండ్రి కనిపించలేదు. తెలిసిన వారి ఇంటికి వెళ్లి ఉంటాడని అనుకున్నాడు. కానీ శనివారం ఉదయం కూడా ఇంటికి తిరిగి రాలేదు. తెలిసినవారిని, బంధువులను ఆరా తీసినా కనిపించలేదు. దీంతో అనుమానం వచ్చిన సురేష్ బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మాజీ మంత్రి టి.హరీష్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా



క్రీడాకారులకు ట్రోఫీ బహుకరిస్తున్న నందకిశోర్

యంగ్‌స్టర్స్ స్పోర్ట్స్ క్లబ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సికింద్రాబాద్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): యంగ్‌స్టర్స్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో అండర్-22 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం బోయిన్‌పల్లి జామియా మసీద్ మైదానంలో ప్రారంభమైంది. కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్, ముస్లిం బోర్డు అధ్యక్షుడు హిష్మరెహ్మాన్ షరీఫ్, ఉపాధ్యక్షుడు అతావుల్లా షరీఫ్‌లు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ కృషి చేస్తున్నదని చెప్పారు. ఈ టోర్నమెంట్ విజేత జట్టుకు ట్రోఫీతోపాటు 10వేల నగదు, రన్నర్స్‌కు 7వేల నగదు బహుమతులను, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఉత్తమ బౌలర్ తదితర అవార్డులను వీఆర్.ఆస్పత్రుల ఎండీ నందకిశోర్ అందచేస్తున్నట్టు తెలిపారు. షకీబ్ షరీఫ్, సయ్యద్ సిరాజ్, సయ్యద్, అర్షద్, యంగ్‌స్టర్స్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు అర్షద్ బేగ్, ఫిరోజ్ ఖాన్, ఎం.ఏ.గఫార్ తదితరులు పాల్గొన్నారు.

వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం అధ్యక్షుడు కాలేరు నరేందర్

తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను తార్నాకలోని వంజరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేందర్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్, సాల్వేరు ముత్తయ్య, సురేందర్, రామోజీ, విజయ్ కుమార్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఐక్యత, పరస్పర సహకారం కోసం పద్మశాలి ఉద్యోగుల సంఘం పని చేస్తోందని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు. పద్మశాలి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఉద్యోగుల ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలి ఉద్యోగులందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పద్మశాలి ఉద్యోగి ఉన్నదన్నారు. పద్మశాలి ఉద్యోగులందరూ ఒకరికొకరు సమన్వయ పరుచుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, రాష్ట్ర సంస్థాగత కార్యదర్శి శిరందాసు యాదగిరేందర్, సహాయ కార్యదర్శులు చింతకింది సుజాత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గుండు శ్రీనివాస్, తుమ్మ విజయలక్ష్మి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బాసబత్తిని రాజేశం, ప్రధాన కార్యదర్శి పున్న శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి శ్రీరాం సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పులిపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ గుప్తా



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయిన మడిపడగ శ్రీనివాస్ గుప్తాను శాలువాలతో సన్మానిస్తున్న ఆ సంఘం సభ్యులు

తార్నాక, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట్ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా మడిపడగ శ్రీనివాస్ గుప్తా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం లాలాపేట్‌లోని నఫీజ్ గార్డెన్‌లో ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నూతన అధ్యక్షుడిగా మడిపడగ శ్రీనివాస్ గుప్త ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా పందిరి సాంబశివరావు గుప్త, కోశాధికారిగా యెనిశెట్టి భాస్కర్ గుప్త ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులందరి సహకరంతో సంఘం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త, ఉపాధ్యక్షుడు నేతి రాములుగుప్త, మర్యాల జగదీశ్వర్ గుప్త, మడిపడగ రాముగుప్త, యెనిశెట్టి కృష్ణ, ఎలగందుల లక్ష్మణ్ రావు గుప్త, ఇంగు వెంకటేశం గుప్త, యెనిశెట్టి శ్రీదేవి గుప్త, ఉప్పల లక్ష్మీ గుప్త, తోడుపునూరి స్వాతి గుప్త, ఎముద్రాల శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దొరికేనా?

వెస్ట్ మారేడుపల్లి నెహ్రూనగర్ కాలనీలోని కెనడి విద్యాలయ పాఠశాల ఎదుట ఆరు సంవత్సరాలుగా మురుగు నీరు రోడ్లపై ఏరులై పారుతుంది. సికింద్రాబాద్ ప్రాంతంలోనే అతి పెద్ద కాలనీలలో ఒకటిగా నెహ్రూ నగర్ కాలనీ 1938లో ఏర్పడింది. 10 లేన్‌లలో ఏర్పడిన ఈ కాలనీలో దాదాపు 5000 మంది ఓటర్లు నివసిస్తున్నారు. అధిక శాతం ధనికులుగా ఉన్న ఈ కాలనీలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉంది. దీంతో కాలనీ పరిసర ప్రాంతాలు దుర్వాసనను వెదజల్లుతున్నాయి. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


కెనడీ పాఠశాల ముందు తరచూ పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

మారేడ్‌పల్లి, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : అప్పటి అవసరాలకు అనుగుణంగా వేసిన డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను సగభాగం మేరకు అధికారులు అభివృద్ధి చేశారు. మిగతా పలు రహదారులలో డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను మార్చకపోవడంతో సమస్య క్లిష్టంగా మారింది. డ్రైనేజీ సమస్య ఏర్పడిన సమయంలో జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఆ రోజు వరకే సమస్య తీరుతుంది. మరుసటి రోజు యదావిధిగా ఏర్పడుతుంది. ఓం శాంతి టిఫిన్ సెంటర్ ముందు తరచూ మురుగు నీరు ఏరులై పారుతుంది. అల్పాహారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల ఉన్నతాధికారులు ఇక్కడికి వస్తుంటారు. అదే విధంగా స్కూల్ విద్యార్థులు ఈ మురుగు నీటిపైనే నడుచుకుంటూ వెళ్ళే పరిస్థితి తరచూ కనబడుతుంది. ఇక్కడి పరిసర ప్రాంతాలు దుర్వాసనతో కంపు కొడుతుంటాయి. అయినా ఇక్కడి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేవారు కరువయ్యారు. ఇదే ప్రాంతంలో మోండా డివిజన్ కార్పొరేటర్ ఉన్నప్పటికీ జఠిలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించకపోవడం శోచనీయమని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

మోండా డివిజన్ పరిధిలోని ఎత్తైన ప్రాంత కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు ఏరులై పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లుగా వదిలివేస్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించడంలో విఫలం


హనుమంతు యాదవ్
నెహ్రూనగర్ పార్కు డెవలప్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్

మారేడ్‌పల్లి నెహ్రూనగర్ కాలనీ పార్క్‌లో వాకింగ్ చేయడానికి తెల్లవారుజాము నుంచే వందలాది మంది సీనియర్ సిటిజన్స్‌తోపాటు స్థానికులు వస్తుంటారు. వీరు సైతం మురుగు నీటిపై రాకపోకలు సాగిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెహ్రూనగర్ కాలనీలో పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నాను.

విపరీతమైన కంపు


రాము, కూరగాయల వ్యాపారి

ఉప్పల్ నుంచి ప్రతి రోజు తెల్లవారుజామునే మారేడ్‌పల్లి ఓం శాంతి టిఫిన్ సెంటర్ వద్దకు వచ్చి వెంట తీసుకువచ్చిన కూరగాయలను ఫుట్‌పాత్‌పై అమ్ముకుంటాను. దాదాపు 500 మంది వినియోగదారులు తన వద్దకు వచ్చి కూరగాయలు తీసుకు వెళుతుంటారు. అప్పటికే ఈస్ట్ మారేడ్‌పల్లి నెహ్రూనగర్ ఎత్తైన ప్రాంతాల నుంచి వచ్చిన మురుగునీరు రోడ్లపై ఏరులై పారుతుంది. దీంతో ఈ ప్రాంతం అంతా అపరిశుభ్రత తాండవిస్తుంది. విపరీతమైన కంపు కొడుతుంది.

కొన్నేళ్ళుగా సమస్య ఉంది


కొమురయ్య
సెక్యూరిటీ గార్డ్

వెస్ట్ మారేడ్‌పల్లి, కెనడి విద్యాలయ స్కూల్ ముందు కొన్నేళ్ళుగా సమస్య తీవ్రంగా ఉంది. పాఠశాలకు వందలాది చిన్నారి విద్యార్థులను వారి తల్లిదండ్రులు మురుగు నీటిపై నడుచుకుంటూ పాఠశాలలో వదిలి వేస్తుండడం బాధ కలిగిస్తుంది. తాను ఏమి చేయగలనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.